సాక్షి
ఖమ్మం
మంగళవారం । 14 । నవంబర్ । 2023





**ఇంటి దొంగల పనేనా?**
కామేపల్లి మండలం ఊటవాగు ప్రాంత అడవిలో చెట్లు నరికిన వారికి అటవీ సిబ్బంది అండ ఉందని అధికారులు గుర్తించి విచారణ చేపట్టారు. 10లో



**దీపారాధన.. ఉపవాసం**
నేటి నుంచి మొదలయ్యే కార్తీక మాసంలో భక్తులు దీపారాధన చేయడంతో పాటు ఉపవాసం ఉండేందుకు సిద్ధమయ్యారు. 12లో

**వాతావరణం**
గరిష్ఠం / కనిష్ఠం
32° / 22°
జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి. సాయంత్రం తర్వాత చలిగాలుల ప్రభావం పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### థర్మకోల్‌తో వరల్డ్‌కప్ నమూనా



వరల్డ్‌కప్ నమూనాతో సుధాకర్

**కల్లూరు రూరల్:** కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ దంతాల సుధాకర్ క్రికెట్ వరల్డ్‌కప్ 2023 నమూనాను ఆకర్షణీయంగా తయారుచేశాడు. ప్రస్తుతం జరిగే వరల్డ్‌కప్‌లో భారతజట్టు గెలవాలనే ఆకాంక్షతో థర్మకోల్‌తో కప్పును తీర్చిదిద్దానని ఆయన తెలిపారు. గత వరల్డ్ కప్ సమయాన క్యారెట్, పుచ్చకాయతో నమూనా కప్ రూపొందించానని వెల్లడించారు.

### నేడు కేవీకేలో కిసాన్ మేళా

**వైరా:** వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన మంగళవారం కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.శైలజ తెలిపారు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తున్న రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, వరికి ప్రత్యామ్నాయంగా యాసంగిలో వేయాల్సిన పంటలపై ఈ మేళాలో రైతులకు సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. అలాగే, సాంకేతిక విధానాలపై స్టాళ్ల ద్వారా అవగాహన కల్పిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలకుల ఆరా



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యయ పరిశీలకులు రాజీవ్‌కుమార్‌సింగ్

**సత్తుపల్లి:** కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జనరల్ అబ్జర్వర్ సత్యేంద్రసింగ్ సోమవారం సత్తుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం, స్ట్రాంగ్‌రూంలను సందర్శించిన ఆయన పోలీస్ స్టేషన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల ఏర్పాట్లపై సూచనలు చేయడంతో పాటు పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రశాంత వాతావరణం నెలకొనేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం, సీఐలు మోహన్‌బాబు, హనూక్ పాల్గొన్నారు.

**పక్కాగా లెక్కతేల్చండి..**
**సత్తుపల్లిటౌన్:** అభ్యర్థుల వ్యయాన్ని పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్‌కుమార్‌సింగ్ సూచించారు. సత్తుపల్లిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు మేడిశెట్టివారిపాలెంలోని చెక్‌పోస్టులో రికార్డులు తనిఖీ చేసిన ఆయన అన్ని వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. ఆయన వెంట అధికారులు ఏ.నాగేశ్వరరావు, కిషోర్ పాల్గొన్నారు.

# అభివృద్ధి బాధ్యత నాదే..




బూర్గంపాడు మండలం లక్ష్మీపురం సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావు, వనమా వెంకటేశ్వరరావు, ఎంపీలు నామా, వద్దిరాజు, పార్థసారథిరెడ్డి, కవిత, ఎమ్మెల్సీ మధు తదితరులు

**బీఆర్ఎస్‌ను గెలిపించే బాధ్యత మీది**
- గోదావరికి ఇరువైపులా కరకట్టలు
- రూ.1,000 కోట్లతో అంచనాలు సిద్ధం
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** గోదావరి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కరకట్టల నిర్మాణానికి ఇప్పటికే రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలిపారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం, దమ్మపేట మండలం మలారంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు. 'ఇక్కడ మీరు ఓట్లేసి పినపాక నుంచి రేగా కాంతారావును, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట నుంచి మెచ్చా నాగేశ్వరరావును గెలిపిస్తే రాష్ట్రంలో మన ప్రభుత్వం వస్తుంది. ఆ తర్వాత ఇక్కడ రెండు రోజులు ఉండి, శ్రీరాముడిని దర్శించుకోవడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతా. ఈ నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యత నాది, వీరిద్దరి గెలుపు బాధ్యత మీది' అని సీఎం కేసీఆర్ ప్రజలనుద్దేశించి అన్నారు.

**జ్వరాలు మాయం..**
ఒకప్పుడు వానాకాలం వస్తే 'మంచం పట్టిన మన్యం' అంటూ పత్రికల్లో వార్తలు వచ్చేవని, పక్కనే గోదావరి ఉన్నా తండాలకు, గిరిజన గూడేలకు తాగునీరు కరువయ్యేదని కేసీఆర్ గతాన్ని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వాలకు గిరిజనులు మనుషుల్లా కనిపించలేదని, అందుకే వారి ఆలనా పాలనా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ పథకం అమలు చేసి ప్రతీ ఇంటికి శుభ్రమైన తాగునీరు అందించామన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో వానాకాలం వస్తే వాగులు నిండి ఆస్పత్రులకు పోవడం కష్టంగా ఉండేదని, హై లెవల్ వంతెనల నిర్మాణంతో ఆ కష్టాలు దూరమయ్యాయని చెప్పారు. ఒక్క పినపాక నియోజకవర్గంలోనే 14 వేల కుటుంబాలకు 57 వేల ఎకరాల భూములకు పట్టాలు అందించామన్నారు. పోడు కేసులు ఎత్తివేయడంతో పాటు రైతుబంధు అందిస్తున్నామని కేసీఆర్ తెలిపారు.



నృత్యం చేస్తున్న ఎంపీలు వద్దిరాజు, కవిత, విప్ రేగా

**పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు..**
కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు అమలు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. గతంలో మైదాన ప్రాంత నియోజకవర్గాల్లో అమలు చేశారని, ఏజెన్సీలో ఉన్న పినపాకలోనూ పైలట్ ప్రాజెక్టుగా ఇవ్వాలని విప్ రేగా కాంతారావు కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు. మళ్లీ ప్రభుత్వం రాగానే పినపాక, భద్రాచలంలో 100 శాతం లబ్ధిదారులకు దళితబంధు అమలుచేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు.

**వనమా గారూ.. చెయ్యెత్తాలి**
ధరణి పోర్టల్ ఉంచాలా ? రద్దు చేయాలా ? అంటూ సభికులను కేసీఆర్ ప్రశ్నించారు. ఉంచాలి అనే వాళ్లు చెయ్యి ఎత్తాలని కోరారు. ఈ సందర్భంగా సభికుల నుంచి పెద్ద ఎత్తున సానుకూల స్పందన వచ్చింది. అందరూ చేతులు పైకి లేపారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో వేదికపై ఉన్న వారు కూడా చెయ్యి ఎత్తి తమ అభిప్రాయం తెలపాలని సీఎం కేసీఆర్ అన్నారు. ఆ వెంటనే కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వైపు చూస్తూ 'వనమా గారూ.. మీరు చెయ్యి ఎత్తాలి' అని అన్నారు. ఆయా సభల్లో ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అభ్యర్థులు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావు, మెచ్చా నాగేశ్వరరావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

**రాజు గారు చెప్పగానే..**
ఏజెన్సీలో ఉండే తండాలు, ఆదివాసీ గూడేల ప్రజలు త్రీ ఫేస్ కరెంట్ లేక ఇబ్బంది పడుతున్నారని భద్రాచలం దగ్గర ఉండే ఓ రాజుగారు తనతో చెప్పారని సీఎం కేసీఆర్ తెలిపారు. ఆవెంటనే రూ.300 కోట్లు మంజూరు చేయించి అన్ని ఆదివాసీ గూడేలు, తండాలకు త్రీ ఫేస్ విద్యుత్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

# మిగిలింది 133...

- పూర్తయిన నామినేషన్ల పరిశీలన
- 147నామినేషన్లలో 14 తిరస్కరించాం
- పూర్తి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్



కలెక్టరేట్‌లో వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ గౌతమ్

**ఖమ్మం సహకారనగర్:** శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఈనెల 3నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించగా... నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ ఆఫీసర్లు సోమవారం అభ్యర్థుల సమక్షాన స్రూటినీ నిర్వహించారు. ఈమేరకు వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి 147 మంది అభ్యర్థులు 215 సెట్ల నామినేషన్లు సమర్పించారని తెలిపారు. ఇందులో పరిశీలన అనంతరం 133 నామినేషన్లు అంతా సక్రమంగా ఉండడంతో ఆమోదించామని వివరించారు. ఇక పలుకారణాలతో 14 నామినేషన్లను తిరస్కరించినట్లు చెప్పారు. కాగా, పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్.. ఎన్నికల సంఘం విడుదల చేసిన హ్యాండ్ బుక్‌లోని వివరాల ఆధారంగా సమాధానాలు ఇచ్చారు.

**పరిశీలకుల సమక్షంలో..**
నామినేషన్లస్క్రూటినీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని, ఇదంతా అభ్యర్థుల ప్రతినిధులు, జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షాన జరిగిందని కలెక్టర్ వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్లను పరిశీలించి వీలైనన్ని అర్హత గలవిగా గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌లో అఫిడవిట్‌లో కొన్ని కాలమ్స్ పూర్తిచేయలేదని కాంగ్రెస్ అభ్యర్థి అభ్యంతరం వ్యక్తం చేశారని చెప్పారు. అయితే, అఫిడవిట్ అనేది పూర్తిస్థాయి ప్రామాణికం కాదనే ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆర్ఓ ఆమోదించారని తెలిపారు.

**ఇంకా మరికొన్ని...**
- మధిర నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థినిగా ఎం.శారద నామినేషన్ దాఖలు చేయగా... బీ ఫాం ఇవ్వకపోవడంతో తిరస్కరించామని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.
- సీపీఎం పార్టీకి చెందిన నాయకులు ఐదుగురు వివిధ నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలుచేయగా.. బీ ఫాం ఇచ్చిన వారిది ఆమోదించి, మిగతావి తిరస్కరించామని చెప్పారు. పార్టీ తరఫున బరిలోకి దిగే అభ్యర్థి నామినేషన్ ఏదైనా కారణాలతో రిజెక్ట్ అయితే వీరిది ప్రత్యామ్నాయంగా ఉంటుందని సమర్పించినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇంకా మరికొన్ని సరైన వివరాలు సమర్పించకపోవడంతో తిరస్కరించామని తెలిపారు.

**ప్రతిపాదకులైనా సరే...**
నామినేషన్ల విత్ డ్రా కోసం ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు అవకాశం ఉందని కలెక్టర్ వెల్లడించారు. అభ్యర్థి నేరుగానైనా, లేదంటే ప్రతిపాదించిన వ్యక్తి అయిన దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉపసంహరణ గడువు అనంతరం ఎందరు అభ్యర్థుల పోటీలో ఉన్నారని వెల్లడించడంతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని పేర్కొన్నారు.



సత్తుపల్లిలో నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు, హాజరైన అభ్యర్థులు, నాయకులు

**నియోజకవర్గాల వారీగా నామినేషన్ల వివరాలిలా**

| నియోజకవర్గం | మొత్తం నామినేషన్లు | ఓకే చేసినవి | తిరస్కరించినవి |
|---|---|---|---|
| ఖమ్మం | 39 | 36 | 3 |
| పాలేరు | 42 | 40 | 2 |
| మధిర | 22 | 17 | 5 |
| వైరా | 16 | 15 | 1 |
| సత్తుపల్లి | 28 | 25 | 3 |
| మొత్తం | 147 | 133 | 14 |

# జిల్లాలో ఎన్నికల పరిశీలకులు

**నిబంధనల అతిక్రమణపై ఫిర్యాదు చేయొచ్చని సూచన**

**ఖమ్మం సహకారనగర్:** శాసనసభ ఎన్నికల నేపథ్యాన కేంద్రం ఎన్నికల సంఘం జిల్లాకు ప్రత్యేక పరిశీలకులను కేటాయించింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను ఇద్దరు వ్యయ పరిశీలకులు, ముగ్గురు సాధారణ పరిశీలకులతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు మరో ఇద్దరిని నియమించారు. ఈ ఏడుగురిలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండగా, కేటాయించిన నియోజకవర్గాల్లో అణువణువూ పరిశీలిస్తూ, ఆరా తీస్తున్న వీరు ఎక్కడైనా నిబంధనల అతిక్రమణ జరిగితే నేరుగా లేదా ఫోన్ ద్వారానైనా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ఫోన్ నంబర్లను కూడా వెల్లడించారు.

| వ్యయ పరిశీలకుల వివరాలు | | |
|---|---|---|
| పేరు | నియోజకవర్గాలు | సెల్‌నంబర్ |
| కునాల్‌కుమార్ | ఖమ్మం, పాలేరు | 93985 98148 |
| రాజీవ్‌కుమార్ సింగ్ | మధిర, వైరా, సత్తుపల్లి | 89193 85028 |
| **సాధారణ పరిశీలకులు** | | |
| తుషార్ కాంత మెహంతి | ఖమ్మం, పాలేరు | 93462 93006 |
| కానారామ్ | మధిర, వైరా | 93985 60944 |
| సత్యేంద్రసింగ్ | సత్తుపల్లి | 93985 59986 |
| **పోలీస్ అబ్జర్వర్లు** | | |
| బ్రిజేష్‌కుమార్ రాయ్ | ఖమ్మం, పాలేరు | 87632 94346 |
| హెచ్.మంజునాథ్ | మధిర, వైరా, సత్తుపల్లి | 94981 44544 |

# ఆయనకు ఓటమి కనిపిస్తోంది..

- నాది ధర్మ పోరాటం, తుమ్మలది అధర్మ పోరాటం
- అంతా సక్రమంగా ఉండడంతోనే నా నామినేషన్‌కు అనుమతి
- మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన మేయర్ నీరజ, గుండాల కృష్ణ తదితరులు

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** చాలా విషయాల్లో తుమ్మల నాగేశ్వరరావు బ్యాలెన్స్ తప్పాడని, ఇప్పుడు ఆయనకు ఓటమి కళ్ల ముందు కనిపిస్తుండడంతో భయం పట్టుకుని తన నామినేషన్ తిరస్కరింపజేయాలని కుట్ర పన్నాడని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ధీరోదాత్తుడు ధైర్యంగా పోరాడుతాడని, పిరికివాడు వెన్నుపోటు పొడవాలని చూస్తాడని ఎద్దేవా చేశారు. 2014లో తనపై ఓడిపోయినప్పుడు, గత ఎన్నికల్లో పాలేరులో ఉపేందర్‌రెడ్డిపై కూడా ఇలాగే అధర్మ పోరాటం చేసినా విజయం దక్కలేదని తెలిపారు. ఇకనైనా ఆయన పిచ్చి ప్రయత్నాలు మానుకుని హుందాతనాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే తన నామినేషన్‌లో అన్ని వివరాలు పూర్తి చేశానని పువ్వాడ తెలిపారు. ఒకవేళ వివరాలు సరిగా లేకపోతే స్క్రూటినీ రోజు ఉదయమే నోటీసు ఇస్తారని, అలాంటిదేమీ ఆర్ఓ నుంచి తనకు అందలేదని చెప్పారు. హెచ్‌యూఎఫ్ కాలమ్‌లో డిపెండెంట్ 1, 2, 3లో తనపై ఆధారపడే పిల్లలు ఎవరూ లేరని పేర్కొన్నానని, తన కుమారుడి వివాహమై ఉద్యోగం చేస్తున్నందునే అలా వెల్లడించానని తెలిపారు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి కామారెడ్డి, కొడంగల్‌లో సమర్పించిన అఫిడవిట్లలో పోలీస్ కేసులు చెప్పాల్సిన ఫార్మెట్ మూడు బాక్సుల్లో, ఏడు బాక్సుల్లో వివరాలు రాశారని తెలిపారు. అఫిడవిట్‌లో అడిగిన సమాచారాన్ని పొందుపరిచిన తర్వాత రిటర్నింగ్ ఆఫీసర్ తుది నిర్ణయం తీసుకుంటారని, ఎవరికైనా అపోహలు ఉంటే కోర్టుకు వెళ్లొచ్చని తెలిపారు. ఈవిషయాన్ని గుర్తించి అసత్య ఆరోపణలను తుమ్మల ఇకనైనా మానుకోవాలని, ప్రజలు కూడా గుర్తించి ధర్మం వైపు నిలబడాలని పువ్వాడ కోరారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, మార్కెట్, కూరాకుల నాగభూషణం, దోరేపల్లి శ్వేత, బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త గుండాల కృష్ణతోపాటు బచ్చు విజయ్‌కుమార్, శీలంశెట్టి వీరభద్రం, పగడాల నాగరాజు, ఖమర్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పొన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని స్థానాల్లోనూ మేమే గెలుస్తాం



అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, కూనంనేని సాంబశివరావు, తుమ్మల తదితరులు

- తెలంగాణలో అధికారంలోకి రాబోతున్నాం
- సమన్వయ భేటీలో ఎల్పీ నేత భట్టి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాల్గొన్న తుమ్మల, కూనంనేని సాంబశివరావు

**ఖమ్మంవన్‌టౌన్:** ఉమ్మడి జిల్లాలోని అన్ని సీట్లను గెలిచి ఈసారి అధికారంలోకి రాబోతున్నందున ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పనిచేయాలని సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఖమ్మంలో సోమవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ పార్టీని విజయ తీరాలకు చేర్చాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉన్నందున రానున్న పదిహేను రోజులు కష్టపడితే విజయం మరింత సులువవుతుందని తెలిపారు. కొత్త, పాత తేడా లేకుండా అందరినీ కలుపుకెళ్లాలని సూచించారు. ఉమ్మడి జిల్లానే కాక కాక తెలంగాణలో 75కి పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రాబోతున్నామని తెలిపారు. ఆతర్వాత కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆత్మగౌరవంతో బతికే వాతావరణం కావాలంటే తనను గెలిపించాలని కోరారు. ఎవరు ఏమరపాటుగా ఉన్నా ఇబ్బంది ఎదురవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. అలాగే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాపం పండగా, అందులో పాలు పంచుకున్న వారూ బాధ్యులుగా నిలబడాల్సి వస్తుందని చెప్పారు. ఖమ్మంలో తుమ్మల, పాలేరులో పొంగులేటితో సహా అన్ని స్థానాల్లో గెలుపు కోసం సీపీఐ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్, కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు పోటు ప్రసాద్, వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, మిక్కిలినేని మంజుల, రావూరి కరుణ, లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, దీపక్‌చౌదరి, మానుకొండ రాధాకిశోర్, వడ్డెబోయిన నర్సింహారావు, కొత్తా సీతారాములు, పొదిల రవికుమార్, దొబ్బల సౌజన్య, కొంగర జ్యోతిర్మయి, కేతినేని హరీష్,బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్ తదతరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి ఎంపీపీ రమ్యకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న పొంగులేటి

**కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ**
**నేలకొండపల్లి:** నేలకొండపల్లి ఎంపీపీ వజ్జా రమ్య బీఆర్ఎస్‌కు సోమవారం రాజీనామా చేశారు. ఎంపీపీతో పాటు ఆమె భర్త, వారి అనుచరులు పలువురు సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులుకండువా కప్పి ఆహ్వానించారు. అయితే, ఎంపీపీని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు.

### ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ఇక్కడ ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు శాస్త్రోక్తంగా నిత్యకల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు.

### ఎన్నికల సామగ్రి వచ్చేసింది!

**ఖమ్మం సహకారనగర్:** శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన పూర్తికాగా, బరిలో మిగిలే అభ్యర్థులెవరో 15వ తేదీన తేలనుంది. దీంతో పోలింగ్ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఇక ఎన్నికల సంఘం నుండి పోలింగ్ సామగ్రి సోమవారం జిల్లాకు చేరింది. ఈ సందర్భంగా పోలింగ్ సామగ్రిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. పోలింగ్ రోజు ఉపయోగించే కంపార్ట్‌మెంట్లు, ఫారాలు, విధివిధానాలతో రూపొందించిన పుస్తకాలు, కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే బ్యానర్లు ఇతరత్రా సామగ్రి మొత్తం చేరాయని తెలిపారు. కాగా, పోలింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులకు వెల్ఫేర్ కిట్లు అందజేయనున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు అజయ్‌కుమార్, కె.శ్రీరామ్, రాంబాబు, మదన్‌గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




జిల్లాకు చేరిన పోలింగ్ కంపార్ట్‌మెంట్లు, ఇతర సామగ్రి

## ఒక ఇడ్లీ తిను నాయనా!



పువ్వాడకు ఇడ్లీ తినిపిస్తున్న టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు

ఖమ్మం మయూరిసెంటర్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మంలోని పలు డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా 17, 28వ డివిజన్లలో ప్రచారం చేయగా, పలువురు మహిళ ఆయన కాళ్లపై నీళ్లు పోసి స్వాగతం పలికారు. ఇక శ్రీనివాస్‌నగర్‌లో ఓ టిఫిన్ సెంటర్ వద్ద నిర్వాహకురాలు ఓటు వేస్తానని చెప్పడమే కాక ఏ సమయానికి తింటావో, ఏమోనంటూ ఇడ్లీ తినాలని కోరింది. దీంతో ఆయన సరేననగా సదరు మహిళ స్వయంగా ఇడ్లీ తినిపించింది. ఇక పువ్వాడ 9వ డివిజన్ పర్యటనలో భాగంగా రోటరీనగర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు.

## సీఎం బస్సు తనిఖీ



బస్సు వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

సత్తుపల్లిరూరల్: భద్రాద్రి జిల్లాలో సోమవారం జరిగిన రెండు ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన హెలికాప్టర్‌లో రాగా, హెలీప్యాడ్ నుంచి సభావేదికల వద్దకు వచ్చేందుకు గాను హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనం ముందుగానే వచ్చింది. ఈ బస్సు ఖమ్మం జిల్లా మీదుగా వెళ్తుండగా సత్తుపల్లి మండలం మేడిశెట్టివారిపాలెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అధికారులు నిశితంగా పరిశీలించాక బస్సు ముందుకు సాగింది.

## మీది గూగుల్ పేనా... ఫోన్ పేనా?!

నేలకొండపల్లి: ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే కావడంతో ఎవరిని కూడా వదులుకునేందుకు అభ్యర్థులు సిద్ధంగా లేరు. ఇప్పటికే గ్రామాల వారీగా ఓటర్ల వివరాలు సేకరించి వారు అందులో ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఫోన్ నంబర్లు కూడా తీసుకున్నారు. పోలింగ్ సమీపిస్తుండడంతో రోజుకు కొంత మంది చొప్పున ఓటర్లకు ఫోన్ చేసి రాను, పోను చార్జీలతో పాటు ఇతర ఖర్చులు కూడా భరిస్తామని, తప్పకుండా వచ్చి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అంతేకాక ఫోన్ పే ఉందా, గూగుల్ పే ఉందా అని ఆరా తీసి ముందుగానే డబ్బులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు.

## సినీ నటుడు సుమన్ వాహనం తనిఖీ



సుమన్ కారులో తనిఖీ చేసిన అధికారులు

కొణిజర్ల: ఎన్నికల వేళ రహదారులపై ప్రయాణిస్తున్నది ఎవరైనా సరే వాహనాలను పోలీసులు నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా సినీనటుడు సుమన్ ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మండలంలోని చెక్‌పోస్ట్ వద్ద అధికారులు కారులో తనిఖీ నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఏఈ రమేష్ ఆధ్వర్యాన పోలీసులు తనిఖీ చేపట్టగా... సుమన్ కారుదిగడంతో స్థానికులు ఆయనతో ఫొటోలు దిగారు.

## నేతల దీపావళి సంబురాలు



నేలకొండపల్లి: కొంగరలో టపాసులు కాలుస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మధిర : కుటుంబ సభ్యులతో కాకరవత్తులు వెలిగిస్తున్న భట్టి విక్రమార్క



సత్తుపల్లిటౌన్: నాయకులు, చిన్నారులతో కలిసి దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటవీరయ్య

మధిర కాంగ్రెస్ అభ్యర్థి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదివారం తన కార్యాలయంలో జరిగిన దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఆయన సతీమణి నందిని, కుమారుడు సూర్య విక్రమాదిత్యతో కలిసి లక్ష్మీపూజ చేశాక వ్యక్తిగత సిబ్బందితో కలిసి బాణసంచా కాల్చారు. అలాగే, వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఇక నేలకొండపల్లి మండలం కొంగరలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానికులతో దీపావళి సంబురాల్లో పాల్గొన్నారు. టపాసులు కాల్చి సందడి చేశారు. – మధిర/నేలకొండపల్లి/సత్తుపల్లి టౌన్

జంగ్ తెలంగాణ



మధుప్రియ పాటకు స్టెప్పులేస్తున్న మెచ్చా, నాయకులు



దమ్మపేట మండలం మల్లారంలో జరిగిన బీఆర్ఎస్ సభకు హాజరైన ప్రజలు

# గులాబీ సందడి...



కిక్కిరిసిన మణుగూరు-బీఎం బంజర రోడ్డు

అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో సోమవారం గులాబీ సందడి నెలకొంది. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం, దమ్మపేట మండలం మల్లారంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ హాజరుకాగా, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సభకు ముందు కళాకారులు ఆటపాటలతో సందడి చేశారు. కళాకారులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేస్తూ హుషారెత్తించారు.
–సాక్షి నెట్‌వర్క్



నృత్యం చేస్తున్న కళాకారులు



డ్యాన్స్ చేస్తున్న మహిళలు



బైక్‌పై సంక్షేమ పథకాలతో ప్రచారం..

## బీఆర్ఎస్ గెలుపు ఖాయమే..

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

దమ్మపేట: ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు గెలుపు ఖాయమేనని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేట మండలం మల్లారంలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజవకర్గం నుంచి జిల్లాలోనే తనకు అత్యధిక మెజారిటీ దక్కిందని, అదే విధంగా మెచ్చాకు కూడా ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.50 వేల కోట్లతో అభివృద్ధి చేశామని, దాంట్లో భాగంగానే సీతారామ ప్రాజెక్టు సైతం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

**కేసీఆర్ చొరవతోనే పోడు పట్టాలు..**

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోడు హక్కు పత్రాలు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే సాధ్యమైందని అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ పోడు పట్టాల పంపిణీతో జిల్లాలో అశ్వారావుపేట నియోజవర్గంలోని గిరిజనులకే అత్యధిక మేలు జరిగిందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా రూ.5కోట్ల వ్యయంతో బోర్లు, పైపులైన్లు, మోటార్లు ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డిగ్రీ కళాశాల, వంద పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, సెంట్రల్ లైటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. మరోసారి తనకు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



# అభివృద్ధికి పట్టం కడదాం

రాజ్యసభ సభ్యుడు పార్థసారధిరెడ్డి



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారధిరెడ్డి, పక్కన నాయకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ప్రాంతం తన ఎదుగుదలకు ఉపయోగపడిందని, మాతృభూమి రుణం తీర్చుకోవడం లక్ష్యంగా తాను రాజకీయాల్లోకి వచ్చానని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధరెడ్డి తెలిపారు. ఈమేరకు సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కొనసాగాలంటే మరోమారు సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య గెలిపించాలని కోరారు. సత్తుపల్లి మండలం రామానగరంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్యకు మరోమారు అవకాశం ఇవ్వాలని కోరారు. కాగా, 12వ తరగతి చదువుతున్న కావ్య కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఎంపీ.. ఆమె చదువు పూర్తయ్యే వరకు బాధ్యత తీసుకుంటానని తెలిపారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల కళావతితో పాటు గొర్ల సంజీవరెడ్డి, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, మోటపోతుల వెంకటేశ్వరరావు, కూసంపూడి రామారావు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

రఘునాథపాలెం/కూసుమంచి/తల్లాడ: రఘునాథపాలెం మండలంలోని మంచుకొండకు చెందిన డి.హరి(35) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన ఈనెల 7న పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న హరి మృతి చెందాడని ఎస్‌ఐ కొండలరావు తెలిపారు. అలాగే, కూసుమంచి మండలం సీతారాంపురానికి చెందిన నక్కనబోయిన మల్లికార్జున్(32) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా మద్యానికి బానిసైన కొంత కాలంగా పనికి వెళ్లడం లేదు. దీంతో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈమేరకు మనస్తాపంతో ఆదివారం ఆయన ఇంట్లో కలుపు మందు తాగగా స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఇక తల్లాడ మండలం బాలపేటకు చెందిన నంద్యాల శ్రీకాంత్(28) ఈనెల 7వ తేదీన ఇంటి వద్ద పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## చిప్స్ ప్యాకెట్ కోసం వెళ్లి బాలుడి మృతి

**నీటి తొట్టిలో పడడంతో కన్నుమూత**



సుశాత్‌రామ్ (ఫైల్)

నేలకొండపల్లి: ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడిన నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. మండలంలోని మంగాపురంతండా గ్రామానికి చెందిన గుగులోత్ సురేష్–స్వప్న కుమారుడు సుశాత్‌రామ్(4) సోమవారం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, తల్లి ఇంట్లో పని చేస్తోంది. సుశాత్ కోసం తెచ్చిన చిప్స్ ప్యాకెట్ గాలికి ఎగిరెళ్లి నీటి తొట్టిలో పడింది. దీంతో బాలుడు నీటి తొట్టిలోకి వంగి తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోయాడు. కాసేపటికి బయటికి వచ్చిన తల్లి నీటిలో మునిగిన సుశాత్‌ను బయటకు తీసేసరికి మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## చెత్తకు నిప్పంటుకుని మంటలు



మధిర ఎగిసిపడుతున్న మంటలు

మధిర: మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ రోడ్డులో సోమవారం రాత్రి చెత్తకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానిక చెడేవారి కాంప్లెక్స్ సమీపాన ఖాళీ స్థలంలో ఉన్న చెత్తకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో మంటలు వ్యాపించడం, ఆపక్కన నివాస గృహాలు, షాపులు ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆవెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మంటలను అదుపు చేశారు.

## బాణసంచా స్వాధీనం

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని దిండిగల శబరినాథ్ నుంచి రూ.35వేల విలువైన బాణసంచా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

చింతకాని: మండలంలోని బస్వాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు కేంద్రం తాళం పగులగొట్టి 33 కేజీల కందిపప్పు, 11 ఆయిల్ ప్యాకెట్లు, రెండు రైస్ కుక్కర్లతో పాటు గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారు. అలాగే, ఏన్కూరు ఏఓ నర్సింహారావు తన ఇంటి ముందు ఉంచిన కారు నాలుగు టైర్లతో బ్యాటరీ కూడా దొంగిలించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

# ఇంటి దొంగల పనేనా?



చెట్లు నరికిన ప్రాంతంలో విచారణ చేస్తున్న ఎఫ్‌డీఓ బాబు, అధికారులు (ఫైల్)

- అడవిని నరికే వారికి అటవీ ఉద్యోగుల సహకారం
- పలువురు ఉద్యోగులపై కొనసాగుతున్న విచారణ
- పక్కా ప్లాన్ ప్రకారమే చెట్లు నరికివేసినట్లు అనుమానాలు

కామేపల్లి: కంచె చేను మేసిన చందంగా అడవులను కాపాడాల్సిన అధికారులే అక్రమంగా చెట్లను నరికివేయిస్తున్నారా... పోడు సాగు కోసం అటవీ ప్రాంతంలో చెట్లను నరుకుతున్న వారికి అండగా నిలుస్తున్నారా... ఇందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో ముడుపులు స్వీకరిస్తున్నారా... దావత్ చేసుకునేందుకు గొత్తికోయల నుంచి జీవాలను సైతం తీసుకున్నారా... ఈ ప్రశ్నలన్నింటికీ తాజా పరిణామాలతో అవుననే సమాధానం వస్తోంది. కామేపల్లి మండలంలోని మద్దులపల్లి ఊటవాగు ప్రాంతంలో అటవీ అధికారులు ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో చెట్లను నరుకుతున్నట్లు తేలగా... బీట్ పరిధిలోని అధికారులను ఆరా తీయగా నివేదిక సమర్పించారు. అయితే, నివేదిక తప్పుల తడకగా ఉందని, చెట్ల నరికి వారికి కొందరు సహకరించారనే ప్రచారం జరిగింది. ఈమేరకు అటవీ శాఖ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు మళ్లీ పూర్తి స్థాయిలో విచారణ చేయడంతో అసలు విషయం బయటపడింది. సుమారు రెండు ఎకరాల్లో చెట్లను నరికేశారని, ఇందుకు అటవీ ఉద్యోగులు సహకరించడంతో తేలడంలో విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కాక తప్పుదోవ పట్టించిన ఓ బీట్ ఆఫీసర్‌పై జిల్లా అధికారి సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే, మరో ఇద్దరిపై విచారణ కొనసాగుతుండగా, ఎవరి పాత్ర ఎంత వరకు ఉందో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

**అడవిలోనే గొత్తికోయల నివాసం..**

మద్దులపల్లి పరిధిలోని ఊగవాగు ప్రాంతంలో 2013లో ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన సుమారు 16 కుటుంబాలు నివాసముంటున్నాయి. అడవిలోనే ఉంటున్న వీరు సుమారు 15 హెక్టార్లలో చెట్లను నరికి పోడు సాగు చేసుకున్నారు. అప్పట్లోనూ వీరికి అటవీ శాఖ అధికారుల సహకారం ఉండడంతోనే అడ్డుకునే ప్రయత్నం చేయలేదనే విమర్శలు వచ్చాయి. ఆతర్వాత రాష్ట్రప్రభుత్వం పోడుసాగుపై కఠినంగా వ్యవహరిస్తూనే హరితహారంలో భాగంగా మొక్కలు నాటించింది. దీంతో కొన్నాళ్లు అధికారులు కొద్దిగా కట్టడి చేసి గోత్తికోయలు సాగు చేసిన భూమిలో సుమారు పది హెక్టార్లు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక గోత్తికోయలను గుట్ట పైనుంచి కిందకు దించాలనే ప్రయత్నించినా వారు ఒప్పుకోకపోవడంతో మళ్లీ ఒత్తిడి తీసుకురాకపోతే మౌలిక వసతులు సైతం కల్పించి ఆ విషయాన్ని పక్కన పెట్టేశారు.



పోడు సాగు కోసం చదును చేసిన అటవీ భూమి

**కొనసాగుతున్న విచారణ**

ఇటీవల ప్రభుత్వం పోడుసాగుదారులు పలువురికి పట్టాలు ఇచ్చింది. ఇంతలోనే మద్దులపల్లి ఊటవాగు ప్రాంతంలో మళ్లీ సాగు కోసం చెట్ల నరికివేత మొదలైంది. దీని వెనుక ఓ పార్టీ నాయకుడు ఉండగా.. ఉద్యోగులకు ముడుపులు అప్పగించడమే కాక గొత్తికోయల నుంచి జీవాలు ఇప్పించినట్లు సమాచారం. ఈవిషయాన్ని ఆలస్యంగా గుర్తించిన ఉన్నతాధికారుల సూచనతో అటవీ భూమిలో చెట్లను నరికిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అంతేకాక ఉద్యోగుల విచారణ చేపట్టి మద్దులపల్లి(తూర్పు) బీట్ ఆఫీసర్ విజయ్‌ను సస్పెండ్ చేశారు.కిక ఊట్కూర్(ఉత్తరం), మద్దులపల్లి(పడమర) బీట్ ఆఫీసర్లపై విచారణ కొనసాగుతుండగా, గొత్తికోయలను ఎవరు ప్రోత్సహించారు, ఉద్యోగుల పాత్ర ఏమిటనే అంశాలు తేలాక మరికొందరిపై చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం.

# అమెరికాలో చదువే టాప్ చాయిస్

## అమెరికాలో ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థుల క్యూ...

- 2022–23 విద్యా సంవత్సరంలో యూఎస్ వెళ్లిన 2,68,923 విద్యార్థులు
- గత విద్యా సంవత్సరంతో పోలిస్తే 35% పెరుగుదల
- అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో 25 శాతం భారతీయులే
- వెల్లడించిన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: కొలువులు, చదువుల కోసం మనోళ్లు విదేశాలకు క్యూ కడుతూనే ఉంటారు. అయితే, విదేశాల్లో విద్యాభ్యాసానికి భారతీయ విద్యార్థుల టాప్ చాయిస్‌గా మాత్రం అమెరికానే ఉంటోంది. యూఎస్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రితం విద్యా సంవత్సరంతో పోలిస్తే.. 2022–23 విద్యా సంవత్సరంలో 35 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. 2022–23లో అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు 2,68,923 మంది విద్యార్థులు వెళ్లినట్టు సోమవారం విడుదలైన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ (ఓడీఆర్) నివేదికలో వెల్లడైంది. ఈ నివేదికలోని వివరాలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయం తమ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొనడం గమనార్హం. అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న 10 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో 25 శాతం మంది భారతీయ విద్యార్థులే అని ఓడీఆర్ వెల్లడించింది.

**63 శాతానికి చేరిన గ్రాడ్యుయేషన్ విద్యార్థులు..**

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ డేటా ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్యలో భారత్ చైనాను అధిగమించింది. క్రితం సంవత్సరంతో పోల్చితే 2022–23 విద్యా సంవత్సరంలో భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 63 శాతం పెరిగి 1,65,936 మందికి చేరుకుంది. దాదాపు 64,000 మంది విద్యార్థులు పెరిగారు. అదే సమయంలో భారతీయ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు సైతం 16 శాతం పెరిగారు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ)ను అభ్యసించే వారి సంఖ్య 69,062కు చేరడంతో అమెరికాలో విద్యాభ్యాసం చేసే విదేశీ విద్యార్థుల్లో భారత్ అగ్రగామిగా నిలిచింది. ఓపీటీ అనేది ఒక రకమైన తాత్కాలిక పని అనుమతి. ఇది అర్హత కలిగిన విద్యార్థులు వారి అధ్యయన రంగానికి సంబంధించిన అనుభవాన్ని పొందడానికి అక్కడ విద్యాభ్యాసం చేసేందుకు ఈ విధానంలో అనుమతి లభిస్తుంది.

**ఈ ఏడాది జూన్–ఆగస్టులో అత్యధిక వీసాలు జారీ..**

అమెరికా యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థులకు ఎఫ్, ఎం, జే కేటగిరీల్లో వీసాల జారీ సైతం ఈ ఏడాది జూన్–ఆగస్టులో గణనీయంగా పెరిగింది. భారత దేశవ్యాప్తంగా ఉన్న యూఎస్ కాన్సులేట్, ఎంబసీల ద్వారా మొత్తం 95,269 వీసాలు జారీ అయ్యాయి. 2022లో జూన్–ఆగస్టులో జారీ చేసిన వీసాలతో పోలిస్తే ఇది 18 శాతం అధికం.

### అమెరికాలో చదువు అంటే విలువైన పెట్టుబడే..



'అమెరికాలోని యూనివర్సిటీల్లో విద్యా భ్యాసం అన్నది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఓ విలువైన పెట్టుబడి లాంటిదే. ఉజ్వల భవిష్యత్తు దిశగా ఈ విద్యార్థులంతా యూఎస్, భారత్‌ను మరింత దగ్గర చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు విద్యార్థులను సిద్ధం చేసే భారతీయ విద్యా వ్యవస్థ బలం హర్షణీయం. విద్యాభ్యాసం కోసం యూఎస్ వచ్చే విద్యార్థుల్లో మహిళల సంఖ్య మరింత పెరగాలని మేం ఆశిస్తున్నాం'.

– యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి

**ఉచిత సలహా కేంద్రాలు..**

అమెరికాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు న్యూఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబైల్లో ఒక్కొక్కటి, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు కలిపి మొత్తం ఆరు కేంద్రాలు ఉన్నాయి. అమెరికాలో విద్యాభ్యాసంపై వివరాల కోసం ఎడ్యుకేషన్‌యూఎస్‌ఏ ఇండియా యాప్ సైతం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లలో అందుబాటులో ఉన్నట్టు యూఎస్ ఎంబసీ అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో కళాశాల దరఖాస్తు ప్రక్రియ గురించి తాజా సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. https://educationusa.state.gov/country/in. వెబ్‌సైట్‌లోనూ పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు.

**విద్యార్థుల జోరు ఇలా...**

| ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక | 2021-21 విద్యా సంవత్సరం | 2022-23 విద్యా సంవత్సరం | పెరుగుదల (%) |
|---|---|---|---|
| యూఎస్‌కు వెళ్లిన మొత్తం భారతీయ విద్యార్థులు | 1,99,182 | 2,68,923 | 35 |
| అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు | 27,545 | 31,954 | 16 |
| గ్రాడ్యుయేషన్ విద్యార్థులు | 1,02,024 | 1,65,936 | 62.6 |
| ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ) | 68,188 | 69,062 | 1.3 |

# 'ఆల్మట్టి'పై పునరాలోచన చేయాలి

- ఆల్మట్టి నుంచి కర్ణాటకకు 16 టీఎంసీలు మళ్లిస్తే తెలంగాణకు నష్టం
- జూరాల, శ్రీశైలంకు వచ్చే వరద ప్రవాహానికి గండి పడుతుంది
- కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు ఉల్లంఘన
- నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ డీజీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా.. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నుంచి ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆ రాష్ట్రానికి 16 టీఎంసీలను కేటాయించాలనే ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలతో ఆల్మట్టి జలాశయం నుంచి దిగువన ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలకు గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు విరుద్ధమైన ఈ ప్రతిపాదనలపై పునరాలోచన చేయాలని కోరింది. నదుల అనుసంధానంపై నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ నెల 10న హైదరాబాద్‌లోని జలసౌధలో సంబంధిత రాష్ట్రాలతో సంప్రదింపుల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తెలంగాణ వాదనలను పేర్కొంటూ అదే రోజు ఎన్‌డబ్ల్యూడీఏకు లేఖ రాశారు.

**ఆ హక్కు కర్ణాటకకు లేదు**

ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆల్మట్టి నుంచి కర్ణాటకలోని మలప్రభ సబ్ బేసిన్‌కు 16 టీఎంసీల కేటాయింపుతో జల నిబంధనల అమలులో పూర్తి సంక్లిష్టమైన పరిస్థితులు ఉత్పన్న మవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్–1 గంపగుత్తగా జరిపిన కేటాయింపుల మేరకు జూరాల, శ్రీశైలం జలాశయాలకు రావాల్సిన జలాలను వినియోగించుకునే హక్కు కర్ణాటకకు లేదని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్ పరిధిలోని సాగునీరు అందని ప్రాంతాలు పెద్ద ఎత్తున ఉండగా, వాటిని విస్మరించి కృష్ణా జలాలను పెన్నా బేసిన్‌కు తరలించడం సబబు కాదని ఆక్షేపించారు. గోదావరి బేసిన్ లోని 968 టీఎంసీల నికర జలాల వినియోగానికి సంబంధించి రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని, ఈ ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు ఇచ్చిన తర్వాతే నదుల అనుసంధానం విషయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోయాలని ప్రతిపాదించడంతో సాగర్‌లో కృష్ణా జలాల నిల్వలపై ప్రభావం పడనుందని పేర్కొన్నారు. వెనకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో 30లక్షల ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 20.3లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 12.2 లక్షల ఎకరాలకు ఇంకా సాగునీరు అందలేదని వివరించారు. ఈ మూడు జిల్లాల్లో సాగుకు యోగ్యమైన 86శాతం భూములకు సాగునీటి సదుపాయం లేదని పేర్కొన్నారు.

**50% జలాలు కేటాయించాలి...**

గోదావరి–కావేరి, బెడ్తి–వార్దా నదుల అనుసంధానంతో తరలించనున్న 166 టీఎంసీల్లో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కోరగా, కేవలం 45 టీఎంసీలు(27శాతం) మాత్రమే కేటాయించినట్టు ఈఎన్‌సీ మురళీధర్ తెలిపారు. కేటాయింపులను 50శాతానికి పెంచాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పులోని 15(బీ) నిబంధన మేరకు బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ద్వారా తరలించనున్న 18 టీఎంసీల్లో 50శాతం .. అంటే 9టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని తెలిపారు. ఇచ్చంపల్లి వద్ద నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి గోదావరి జలాలను తరలించాలని సూచించారు. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ నిర్వహణలో సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని 148 టీఎంసీలనే గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా తరలించనున్నట్టు కేంద్రం పేర్కొంటున్న నేపథ్యంలో.. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మతి తీసుకోవాలని కోరారు.

# ఏపీలో కుల గణనకు నాంది

## రేపు 5 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కుల గణన ప్రారంభం

- 3 గ్రామ సచివాలయాలు, 2 వార్డు సచివాలయాల పరిధిలో మొదలు
- రెండు రోజులు ప్రయోగాత్మకంగా కుల గణన
- కుల గణనపై ఈ నెల 22 వరకు శిక్షణ
- బుధవారం నుంచే జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు
- విశాఖ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనకు బుధవారం నాంది పలకనుంది. రాష్ట్రంలో ఐదు సచివాలయాల పరిధిలో ప్రయోగాత్మకంగా కుల గణన చేపట్టనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజులు గ్రామీణ ప్రాంతాల్లో మూడు గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో రెండు వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుంది. సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కుల గణన చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడానికి ఈ నెల 3న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కుల గణన ముందస్తు షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి ఎం. గిరిజా శంకర్ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉన్న వివిధ శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లకు తెలియజేస్తూ యూఓ నోట్ విడుదల చేశారు. ముందస్తుగా ఐదు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కులగణన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వెల్లడైన అభిప్రాయాలు, సూచనలతో అవసరమైతే మార్పులు చేసి, పూర్తి స్థాయిలో కులగణన చేపట్టనున్నట్లు సమాచారం.

**సిబ్బందికి శిక్షణ**

రాష్ట్రవ్యాప్తంగా కుల గణనలో ఎన్యూమరేటర్లుగా వ్యవహరించే సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పర్యవేక్షణ చేసే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు మూడు విడతల్లో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్లకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో మంగళ, లేదా బుధవారం శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

**రేపటి నుంచే రౌండ్ టేబుల్ సమావేశాలు**

కుల గణనపై ప్రభుత్వం బుధవారం నుంచి జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనుంది. బుధ, గురువారాల్లో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత భాగస్వామ్యులతో ఈ సమావేశాలు జరుగుతాయి. ఆ తర్వాత ఐదు ప్రాంతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు జరపనున్నారు. ఈ నెల 17న రాజమండ్రి, కర్నూలులో, 20న విశాఖ, విజయవాడలో, 24న తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రాంతీయ సదస్సులు జరిగే ఐదు జిల్లాల్లో ప్రత్యేకంగా జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండవని రాష్ట్ర ప్రణాళిక శాఖ స్పష్టం చేసింది.

# నేడు అల్పపీడనం!

## 16న వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ ఈ నెల 16వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే ఏపీపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. కాగా.. మంగళవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అలాగే బుధవారం తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపింది.

**జిల్లా వార్తలు**

## జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌తో ప్రతిభ



అథ్లెట్లను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తురులో జరిగిన జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో ఖమ్మంకు చెందిన అథ్లెట్లు పతకాలు సాధించారు. జూనియర్ బాలికలలాంగ్ జంప్, హెప్టాథిలిన్‌లో బి.వైశాలి, లాంగ్‌జంప్‌లో ఎ.మనుశ్రీ, ఎ.మైథిలి పతకాలు సాధించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న బాలికలు పతకాలు సాధించడంపై సోమవారం డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి అభినందించారు. సీనియర్ అథ్లెటిక్ అకాడమీ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు సుధాకర్, కృష్ణయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, రవి, హలీం పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి ఉషూ టోర్నీలో..**

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17, 19 ఉషూ టోర్నీలో ఖమ్మం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఆయా విభాగాల్లో వై.సుశాంత్, జె.భరత్, బి.అభిలాష్, ఎం.రాకేష్, పి.అజయ్‌కుమార్ పతకాలు సాధించారు. వీరిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, ఉషూ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి అభినందించారు.

## గుంటు మల్లన్న ఆలయంలో ఆకాశ దీపం



ఆకాశ దీపాన్ని ధ్వజస్తంభం పైకి లాగుతున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసం ఉత్సవాలను పురస్కరించుకుని ఖమ్మంలోని శ్రీ భ్రమరాంబ, శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి ఆకాశ దీపం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ, ఈఓ చందూరు రామకోటేశ్వరరావు ధ్వజస్తంభం వద్ద, ఆకాశ దీపానికి పూజలుచేశారు. అనంతరం ఆకాశ దీపాన్ని పూలమాలలతో ధ్వజస్తంభంపై ఆవిష్కరించారు.

# దీపారాధన.. ఉపవాసం



విద్యుత్ లైట్లతో ముస్తాబైన ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయం

**కార్తీకమాసం ఎంతో ప్రత్యేకం**

- నేటి నుంచి డిసెంబర్ 13 వరకు..
- భక్తిశ్రద్ధలతో పూజిస్తే హరిహరుల అనుగ్రహం

కొత్తగూడెంటౌన్/భద్రాచలంటౌన్/ఖమ్మం గాంధీచౌక్: హిందూ సంప్రదాయంలో కార్తీకమాసానికి విశిష్ట ప్రాధాన్యం ఉంది. కార్తీక మాసాన్ని వ్రతాల మాసంగా కూడా పిలుస్తారు. మంగళవారం (14న) ప్రారంభం కానున్న కార్తీకమాసం డిసెంబర్ 13న ముగియనుంది. ఈ సమయంలో పూజలు చేస్తే పుణ్యఫలాలు లభిస్తాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటారు. ఇక పెళ్లికాని యువతులు తులసి మొక్కను పూజిస్తే.. పెళ్లిళ్లు జరుగుతాయని పలువురు విశ్వసిస్తుంటారు.

**పూజనీయమైన మాసం..**

కార్తీకమాసం హరిహరాదులకు ప్రీతికరం. కార్తీక మాసం ప్రత్యేక పూజానీయమైనదని విశ్వాసం. ఈ మాసం ప్రాముఖ్యతను స్కంద పురాణాల్లో వివరించారు. ఈ నెలలో మహిళలు ఇళ్లు, ఆలయాల్లోనూ పవిత్రంగా పూజలు చేస్తారు. దీపారాధనలు, హోమం, అభిషేకం, సామూహిక కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. ఆలయాలు భక్తుల కోలాహలంతో సందడిగా మారతాయి. ఈ మాసంలో సూర్యచంద్రుల కిరణాలు మనస్సుకు, శరీరానికి మంచి ఫలితాలను ఇస్తాయని హిందూ భక్తులు విశ్వసిస్తారు. చాలా మంది శ్రీకృష్ణుడికి దీపాలు వెలిగించి పూజిస్తారు.

**బ్రహ్మ ముహూర్తం..**

యమునా నదిలో లేదా కార్తీకమాసంలో ఏదైన పవిత్ర నదిలో బ్రహ్మ ముహూర్తంలో స్నానం, లేదా నదీ నీళ్లను స్నానం చేసే నీళ్లతో కలిపి చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ మాసంలో మహిళలు ఉదయాన్నే లేచి స్నానం చేస్తారు. పెళ్లైన వారు తమ పసుపుకుంకుమలు నూరేళ్లు చల్లగా ఉండాలని, భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో జీవించాలని, పెళ్లికాని యువతులు తమకు అన్ని విధాలా, మంచి గుణగణాలు ఉన్న వరుడు భర్తగా రావాలని, మంచి చదువులు కావాలని, ఉద్యోగంలో రాణించాలని కోరుకుంటారు.

**ఉపవాసం అత్యంతపవిత్రం**

కార్తీకమాసం ప్రారంభమైన రోజు నుంచి పూర్తయ్యే వరకు నెల రోజులపాటు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించి ఉపవాసాలు చేస్తారు. ఈ నెలలో ఉపవాసం అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. మాంసాహారాన్ని పూర్తిగా మానివేస్తారు. రోజూ శాకాహారం తీసుకుంటారు.

**ఇవీ ప్రత్యేకం**

ఈ నెల 14న మంగళవారం ఆకాశదీప ప్రారంభం

| | |
|---|---|
| 17న | నాగుల చవితి |
| 20న | మొదటి సోమవారం |
| 24న | శుక్రవారం క్షీరాబ్ధి ద్వాదశి |
| 26న | ఆదివారం జ్వాలా తోరణం |
| 27న | రెండో సోమవారం |
| | కార్తీక పౌర్ణమి |
| 4న(డిసెంబర్) | మూడవ సోమవారం |
| 11న | నాలుగో సోమవారం |

**ఆలయాల్లో సందడి..**

కార్తీకమాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. కొత్తగూడెం గణేష్‌టెంపుల్, రైటర్‌బస్తీలోని శ్రీమాతాశక్తి పంచాయత క్షేత్రం, బూడిదగడ్డబస్తీలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం, రామవరంలోని సీతారామహనుమశ్శివాలయం, సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద ఉన్న శ్రీకనకదుర్గ మహేశ్వరీ దేవి అమ్మవారి ఆలయం, రుద్రంపూర్‌లోని శివాలయం, విద్యానగర్‌కాలనీలోని శివాలయం, లక్ష్మీదేవిపల్లి శ్రీచండీ సర్వజ్ఞ పీఠం తదితర ఆలయాల్లో భక్తులు కార్తీకమాసం సందర్భంగా ఘనంగా పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

**నియమనిష్టలతో..**

కార్తీక మాసంలో నియమనిష్టలతో పూజలు చేస్తారు. అందుకే భక్తులు ఈ మాసంలో అయ్యప్ప, శివమాలలధారణ చేస్తారు. ఎంతో నిష్టగా ఉంటారు. కార్తీక మాసంలో పాటించే సంప్రదాయాలతో ఆరోగ్యం, పరోపకారం, వనభోజనాలతో ఖ్యాతి, సద్బుద్ధిని కలుగజేస్తాయి.

– రమాదేవి, భద్రాచలం


**భక్తిశ్రద్ధలతో పూజిస్తే పుణ్యఫలం**



ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన మాసం ఇది. ఈ సమయంలో నెల రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి పూజించడంతో ఉపవాసం పాటిస్తే శివుడు, విష్ణువుల అనుగ్రహం ఉంటుంది. కార్తీక మాసంలో పూజలు చేస్తే పుణ్యం లభిస్తుంది.

– రాధాకృష్ణశర్మ, గణేష్‌టెంపుల్, కొత్తగూడెం

# గురుకుల కళాశాల విద్యార్థినుల ఆందోళన



ఆందోళనకు దిగిన విద్యార్థినులు

కొణిజర్ల: వంట సరిగా వండటం లేదని, రుచిగా లేక తినలేకపోతున్నామని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ మండలంలోని తనికెళ్లలో గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం ఆందోళనకు దిగారు. తనికెళ్లలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కొనసాగుతుండగా 250 మంది బాలికలు చదువుతున్నారు. కొన్ని రోజులుగా భోజనం సరిగా లేదని వీరు చెబుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి చేరుకుని మాట్లాడగా, వంట ఏజెన్సీని మార్చాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రిన్సిపాల్ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

# బాలలు.. అదరగొట్టారు!



బాలోత్సవ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ శర్మ, పక్కన నిర్వాహకులు

- మధిరలో ప్రారంభమైన జాతీయస్థాయి బాలోత్సవ్
- తొలిరోజు శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మధిర: ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యాన 26వ జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మధిరలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన ఈ పోటీలను డీఈఓ సోమశేఖర శర్మ ప్రారంభించి మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కళా పరిషత్ ఆధ్వర్యాన ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆతర్వాత ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని మాట్లాడగా, ఎంఈఓ వై.ప్రభాకర్, కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్జితో పాటు సభ్యులు మారోని బాయి, సోనీబాయి, ఝాన్సీబాయి, ఉమాప్రసన్న, దినకర్, మేఘశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల కళానైపుణ్యం**

బాలోత్సవత్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇతర జిల్లాల విద్యార్థులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలిరోజు శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాల పోటీలు జరిగాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన తమ హావభావాలతో కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వ్యతిరేకిగా కాంగ్రెస్

## మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీయే సర్వస్వం అనుకుని యాభై ఏళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన తనకు ఇంత వరకు సొంత ఇల్లు సైతం లేదని, అంతలా సేవ చేసిన తనను పార్టీ ఇప్పుడు అనాథలా మార్చి బయటకు నెట్టిందని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎదురైన అవమానంతోనే బీఆర్ఎస్ నాయకుల ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరానని తెలిపారు. 2018లో సత్తుపల్లి టికెట్ ఇస్తామని చెప్పి పొత్తులో భాగంగా టీడీపీకి ఇచ్చినా అభ్యర్థి తరఫున విస్తృత ప్రచారం చేశానని చెప్పారు. ఇప్పుడు సత్తుపల్లి టికెట్‌ను డబ్బు ఉన్న వారికి, జెండా పట్టని వాళ్లకు ఇచ్చి మరోమారు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఎన్నో పదవులు అనుభవించడమే కాక, పార్టీకి మరెన్నో విజయాలు అందించానని, మాట మాత్రం చెప్పకుండా ఇతరులకు టికెట్ ఇవ్వడమంటే తనను అవమానించినట్లేనని సంభాని తెలిపారు. కాగా, బీఆర్ఎస్‌లో చేరింది పదవులు, డబ్బు కోసం మాత్రం కాదని చెప్పారు. కేసీఆర్‌ను కలిసినప్పుడు సీతారామ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని కోరగా స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, నాయకులు గుండాల కృష్ణ, డోకుపర్తి సుబ్బారావు, అమరగాని వెంకన్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.